మాట్లాడుతున్న యుటిఎఫ్ రాష్ట్ర సహాధ్యక్షులు కె సురేష్ కుమార్

దసరా 'ప్రైవేటు' దోపిడీ...

- ప్రయివేటు బస్సుల్లో ఇష్టారాజ్యంగా ఛార్జీల వసూలు
- ఖాళీ అవుతున్న సామాన్యుల జేబులు - ఛార్జీల నియంత్రణలో అధికారులు విఫలం

ప్రజాశక్తి-కర్నూలు ప్రతినిధి

పండగ సీజన్ వచ్చిందంటే ప్రయివేటు ఆపరేటర్లు వసూళ్ల పండగ చేసుకుంటున్నారు. ఇష్టానుసారంగా బస్సుల ఛార్జీలను పెంచేసి ప్రయాణికులను నిలువు దోపిడీ చేసేస్తున్నారు. రద్దీకి అనుగుణంగా ఛార్జీలను బాదేస్తున్నారు. దసరా పండుగతో పాటు వరుస సెలువులు రావడంతో ప్రయివేటు బస్సుల్లో ప్రయాణించే ప్రయాణికులకు పర్సు ఖాళీ కాకా తప్పడం లేదు. పండుగ సీజన్‌లో ప్రయాణికుల నుంచి ఏర్పడిన డిమాండ్‌నే ప్రయివేటు ట్రావెల్స్ సొమ్ము చేసుకుంటున్నాయి. బస్సు రూటుతో పని లేకుండా చార్జీలను రెట్టింపు చేసేసారు. అదనపు ఛార్జీలు వసూలు చేయకుండా ఛార్జీలను నియంత్రించాల్సిన రవాణా శాఖ అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారన్న బహిరంగ విమర్శలు వ్యక్తమవుతున్నాయి...

ఆర్టీసిలో ప్రత్యేక బస్సుల్లో కూడా సాధారణ ఛార్జీలు వసూలు చేస్తుంటే ప్రయివేటు ట్రావెల్స్ మాత్రం మామూలు సర్వీసుల్లోనే అదనపు ఛార్జీ వసూలు చేసేస్తున్నారు. అదనపు ఛార్జీలు వసూలు చేయకుండా ఛార్జీలను నియంత్రించాల్సిన రవాణా శాఖ అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారన్న బహిరంగ విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఆర్టీసిలోని సూపర్ లగ్జరీ బస్సుల్లో కర్నూలు నుంచి హైదరాబాద్‌కు రూ.350 ఉండగా అదే మార్గంలో ప్రయివేటులో నాన్ ఎసి సీటర్‌లో రూ.1500 వరకూ, ఎసి సీటర్‌లో రూ.1200 నుంచి రూ.2111, నాన్ ఎసి స్లీపర్‌లో అయితే రూ.900 నుంచి రూ.2వేల వరకూ, ఎసి స్లీపర్‌లో రూ.1749 నుంచి రూ.3399 వరకూ వసూలు చేస్తున్నారు. పండుగ సెలవులు ముగియడంతో కర్నూలు నుంచి హైదరాబాద్ నుంచి వెళ్లే వారి సంఖ్య ఎక్కువ ఉండటంతో ఆ రూట్‌లో ప్రయివేటు ట్రావెల్స్ అధిక మొత్తంలో దండుకుంటున్నాయి. హైదరాబాద్ నుంచి నంద్యాలకు ఎపిఎస్ఆర్‌టిసిలో రూ.490 ఉండగా అదే మార్గంలో ప్రయివేటులో నాన్ ఎసి సీటర్‌లో రూ.600 నుంచి రూ.1290 వరకూ, ఎసి సీటర్‌లో రూ.850 నుంచి రూ.2590, నాన్ ఎసి స్లీపర్‌లో అయితే రూ.1400 నుంచి రూ.3వేల వరకూ, ఎసి స్లీపర్‌లో రూ.1100 నుంచి రూ.2990 వరకూ వసూలు చేస్తున్నారు. కర్నూలు నుంచి విజయవాడకు ఆర్టీసి సూపర్ లగ్జరీలో రూ.512 ఛార్జీ ఉండగా ప్రయివేటులో సీటర్‌లో రూ.858 వరకూ వసూలు చేస్తున్నారు. అదే మార్గంలో ఆర్టీసి స్లీపర్‌లో రూ.870 ఉండగా ప్రయివేటులో రూ.990 నుంచి రూ.1130 వరకూ ఉంది. విజయవాడ నుంచి కర్నూలుకు స్లీపర్‌లో రూ.800 నుంచి రూ.1090 వరకూ వసూలు చేస్తున్నారు. పండుగల నేపథ్యంలో రవాణా శాఖ అధికారులు పలు మార్గాల్లో నిరంతరం ప్రత్యేక తనిఖీలు చేయాల్సి ఉంది. ఎక్కువ మొత్తంలో ఛార్జీలు వసూలు చేసినా, బస్సులకు ఫిట్‌నెస్ లేకపోయినా జరిమానా విధించడంతో పాటు వాహనాలను సీజ్ చేయాల్సి ఉంది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఆ పరిస్థితి కనిపించడం లేదు. ప్రయివేటు బస్సుల్లో అధిక ఛార్జీల వసూలును నియంత్రించడంలో రవాణా శాఖ అధికారులు విఫలం అయ్యారన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

బ్లాక్‌లోనూ టికెట్లు

పండగ సీజన్‌లో ఊరికెళ్లేందుకు ప్రయాణికులు సీట్ల కోసం నానా తంటాలు పడాల్సి వస్తోంది. వారం రోజుల ముందు నుంచే ఆన్‌లైన్‌లో రిజర్వేషన్ చేసుకునేందుకు ప్రయత్నాలు మొదలెట్టినా సీట్లు లభించడం లేదు. ఆయా ప్రయివేట్ ట్రావెల్స్ ఆపరేటర్లు ముందుగా టికెట్లను బుక్ చేసేసి ప్రయాణికుల నుంచి వచ్చే డిమాండును బట్టి బ్లాక్‌లో అధిక ధరలకు విక్రయించుకుంటున్నారన్న వార్తలూ వినిపిస్తున్నాయి.

12వ పిఆర్‌సి అమలు చేయాలి

- యుటిఎఫ్ రాష్ట్ర సహాధ్యక్షులు కె.సురేష్ కుమార్

ప్రజాశక్తి -ఎమ్మిగనూరు

12వ పిఆర్‌సిని తక్షణం అమలు చేయాలని, పిఆర్‌సి అమలయ్యే వరకు 30 శాతం మధ్యంతర భృతి ఇవ్వాలని యుటిఎఫ్ రాష్ట్ర సహాధ్యక్షులు కె.సురేష్ కుమార్ , జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రవికుమార్, నవీన్ పాటీలు డిమాండ్ చేశారు. బుధవారం ఎమ్మిగనూరు యుటిఎఫ్ ప్రాంతీయ కార్యాలయంలో జిల్లా గౌరవాధ్యక్షులు ఎస్.దావీదు అధ్యక్షతన ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయులకు 2023 జులై ఒకటవ తేదీ నుండి 12వ పిఆర్‌సిని అమలు చేయాల్సి ఉన్నప్పటికీ, అమలు చేయడంలో పాలకులు వైఫల్యం చెందారన్నారు. గత ప్రభుత్వ విధానాల వల్ల 11వ పిఆర్‌సిలో ఉద్యోగ, ఉపాధ్యాయులు పూర్తిగా నష్టపోయారన్నారు. వైసిపి ప్రభుత్వ హయాంలో పిఆర్‌సి కమిషన్ ను నియమించి నప్పటికీ, పిఆర్‌సిని అమలు చేయడంలో చిత్తశుద్ధిని ప్రదర్శించలేదన్నారు. పిఆర్‌సి అమలుజాప్యం వల్ల ఉద్యోగ ఉపాధ్యాయులు తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. గత ప్రభుత్వం నియమించిన డాక్టర్.మన్మోహన్ సింగ్ కమిషన్ బాధ్యతల నుండి వైదొలగినందున పిఆర్‌సి అమలులో మరింత జాప్యం జరిగే అవకాశం ఉందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఈ జాప్యాన్ని నివారించేందుకు తక్షణమే దసరా కానుకగా 30 శాతం మధ్యంతర భృతిని ప్రకటించి అమలు చేయాలని డిమాండ్ చేశారు. మధ్యంతర భృతిని అమలు చేయడంతో పాటు పిఆర్‌సి నూతన కమిషన్ నియామకం చేపట్టాలని కోరారు. ఉద్యోగుల అండదండలతో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ఉద్యోగ, ఉపాధ్యాయుల ఆకాంక్షలకు అనుగుణంగా గత పిఆర్‌సిలో జరిగిన నష్టాన్ని దృష్టిలో పెట్టుకొని మెరుగైన ఫిట్మెంట్ ను ప్రకటించాలని కోరారు. దీంతోపాటు ఉద్యోగ, ఉపాధ్యాయులకు చెల్లించాల్సిన ఆర్థిక బకాయిలను తక్షణం చెల్లించేందుకు చర్యలు చేపట్టాలన్నారు. ఉద్యోగ, ఉపాధ్యాయులు తమ అవసరాల కోసం దాచుకున్న ప్రావిడెంట్ ఫండ్ రుణాలు, ఎపిజిఎల్ఐ రుణాలు, తుది చెల్లింపులు, సరెండర్‌లీవ్ బకాయిలు, గత పిఆర్‌సి బకాయిలతో పాటు, డిఎ బకాయిలను తక్షణం చెల్లించాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు పెండింగ్‌లో ఉన్న రెండు డిఎలను దసరా కానుకగా విడుదల చేయాలని కోరారు. ఈనెల 10న జరగనున్న రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో ఆ మేరకు చర్చించి నిర్ణయం తీసుకోవాలని కోరారు. ఈ సమావేశంలో రాష్ట్ర కౌన్సిలర్ జె.ఎల్లప్ప, ఎస్ఎం.జయరాజు,జిల్లా ట్రెజరర్ యెహోషువ, జిల్లా కార్యదర్శి దేవపాల్, జిల్లాఆడిట్ సభ్యులు డి.కౌలన్న, వై.రామంజినేయులు, సీనియర్ నాయకులు కె.నాగరాజు, ఎం.నాగరాజు, వివిధ మండలాల నాయకులు బాబు ,చంద్రపాల్, పాపయ్య, నీలీ నాగరాజు, భాగ్యరాజు, ఎస్.సుధాకర్, ఎం.సుధాకర్, రవి, రాజశేఖర్, భాస్కర్,కార్యకర్తలు పాల్గొన్నారు.

దరఖాస్తుల వెల్లువ

- మద్యం షాపులకు 2058 దరఖాస్తులు
- సరాసరి షాపునకు 21
- ఈనెల 11కు పొడిగించిన గడువు
- ప్రభుత్వానికి రూ.41.16 కోట్ల ఆదాయం

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్

ప్రభుత్వం ప్రవేశపెట్టిన నూతన మద్యం పాలసీలో భాగంగా మద్యం షాపులకు ఏర్పాటు కోసం కర్నూలు జిల్లా నుంచి దరఖాస్తులు వెలువెత్తుతున్నాయి. ఈ మేరకు జిల్లాలో 7 ఎక్సైజ్ పోలీస్ స్టేషన్ల ద్వారా బుధవారం సాయంత్రానికి 2058 దరఖాస్తులను జిల్లా ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ శాఖకు అందాయి. రాష్ట్ర ప్రభుత్వం ఈనెల 1వ తేదీ నుంచి దరఖాస్తులను మద్యం షాపులో ఏర్పాటు కోసం ఆసక్తి కలిగిన వారి నుంచి ఆహ్వానిస్తోంది. ఒక దరఖాస్తు రుసుం రూ.2 లక్షలు చొప్పున నిర్ణయించింది. మొదట్లో దరఖాస్తులు తక్కువ సంఖ్యలో వచ్చాయి. దీనిపై పలువురి ప్రజాప్రతినిధుల ఒత్తిళ్లు ఉన్నాయన్న ఆరోపణలు కూడా వినిపించాయి. దరఖాస్తుల స్వీకరణ గడువు బుధవారం సాయంత్రం ఐదు గంటలకు ముగియనుండడంతో ఈ సంఖ్య వేగాన్ని పుంజుకుంది. అందులో భాగంగా జిల్లాలో 99 మద్యం షాపులకు గాను కర్నూలు జిల్లాలోని ఏడు ఎక్సైజ్ ప్రొహిబిషన్ స్టేషన్ల పరిధిలో 2058 దరఖాస్తులు బుధవారం అందాయి. కర్నూలు 960, కోడుమూరు 350, ఆదోని 181, ఆలూరు 151, ఎమ్మిగనూరు 183, కోసిగి 36, పత్తికొండ 200 చొప్పున దరఖాస్తులు అందాయి. ఒక్కో స్టేషన్‌కు సగటున 21 దరఖాస్తులు అందాయి. ఈ లెక్కన ప్రభుత్వానికి రూ.41.16 కోట్ల ఆదాయం సమకూరింది. ఈ ఆదాయం మరింత పెరిగే అవకాశం ఉంది. ఈనెల 9వ తేదీ దరఖాస్తుల స్వీకరణకు చివరి తేదీగా మొదట నిర్ణయించి నప్పటికీ దరఖాస్తుల విలువ పెరగడంతో దరఖాస్తుల స్వీకరణ గడువును ఈ నెల 11 వరకు ప్రభుత్వం పొడిగించింది. ఈనెల 14వ తేదీ సాయంత్రం 7 గంటల వరకు దరఖాస్తులు స్వీకరించి 16వ తేదీ డిప్పు డ్రా చేసి అదేరోజు షాపును దక్కించుకున్న వారు షాపులను ప్రారంభించు కోవచ్చని ఎక్సైజ్ సూపరింటెండెంట్ శ్రీధర్ బాబు తెలిపారు.

ఏడాది చివరికల్లా లక్ష్యాలను సాధించాలి

- జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాష

మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ రంజిత్ బాషా

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

ఈ ఏడాది చివరి కల్లారెండవ దశ 100 రోజుల ప్రణాళిక లక్ష్యాలను సాధించాలని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా అధికారులను ఆదేశించారు. బుధవారం వంద రోజులు లక్ష్యాలపై (ఫేజ్-II)కలెక్టర్ జిల్లా స్థాయి అధికారులతో సమీక్ష నిర్వహించారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ విత్తన పంపిణీ, పొలం పిలుస్తోంది తదితర కార్యక్రమాలను నిర్దేశించిన లక్ష్యాల మేరకు పూర్తిచేయాలన్నారు. 95 కిచెన్ గార్డెన్స్, 50 స్కూల్ న్యూట్రిగార్డెన్స్‌ను కూడా పూర్తిచేయాలని, సంబంధించి 12 ఎకరాల్లో మల్బరీ ప్లాంటేషన్, కిసాన్ నర్సరీ ల పెంపకం, బైవోల్టీన్ కకూన్స్ హార్వెస్టింగ్, తదితర కార్యక్రమాలను నిర్వహించాలన్నారు. పశుసంవర్ధక శాఖకు సంబంధించి 1200 గోకులంలను వంద రోజుల్లో గ్రౌండింగ్ చేయాలన్నారు. విద్యా శాఖకు సంబంధించి 10వ తరగతి విద్యార్థులకు ఉత్తమ ఉపాధ్యాయుల ద్వారా ఆన్‌లైన్‌లో పాఠాలు బోధించేందుకు నెలలోపు జిల్లా స్థాయిలో వర్చువల్ క్లాస్ రూం ను ఏర్పాటు చేయాలన్నారు,. పంచాయతీ రాజ్‌కు సంబంధించి రూ.52 కోట్లతో పల్లె పండుగ ద్వారా చేపడుతున్న 70 కిలోమీటర్ల సీసీ రోడ్లను సంక్రాంతి లోపు పూర్తి చేయాల్సి ఉందని ఆదేశించారు.

పల్లె పండుగను విజయవంతంగా నిర్వహించాలి

జిల్లాలో అక్టోబర్ 14వ తేదీ నుండి 20వ తేదీ వరకు చేపట్టనున్న 'పల్లె పండుగ' కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ఎన్ఆర్ఇజిఎస్ కింద సిసి రోడ్లు, బిటి రోడ్లు, హార్టికల్చర్ ప్లాంటేషన్, గోకులంలకి సంబంధించి 100 కోట్లకు పైగా పనులను మంజూరు చేశామని, వీటికి శంకుస్థాపనలు చేసి పనులు మొదలు పెట్టాలన్నారు.. ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు 'పల్లె పండుగ' కార్యక్రమంలో పాల్గొంటారని, అందుకు సంబంధించి గ్రామాల వారీగా షెడ్యూల్ ను ఈ రోజు లోపు పంపాలని కలెక్టర్ జిల్లా పరిషత్ సిఇఒ ను ఆదేశించారు. సమావేశంలో సిపిఒ హిమ ప్రభాకర్ రాజు, డిఆర్ఒ చిరంజీవి, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

శాంసంగ్ కార్మికుల సమ్మెకు మద్దతుగా ధర్నా

శాంసంగ్ కార్మికులకు మద్దతుగా ధర్నా చేస్తున్న సిటియు నాయకులు

ప్రజాశక్తి - కర్నూలు కార్పొరేషన్

తమిళనాడులో శాంసంగ్ కార్మికులు చేస్తున్న సమ్మెకు మద్దతుగా సిఐటియు నగర కమిటీ ఆధ్వర్యంలో బుధవారం గాయత్రి ఎస్టేట్ సమీపంలోని శాంసంగ్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించడం జరిగింది. ఈ ధర్నాకు ఆటో యూనియన్ నగర కార్యదర్శి బి.రాధాకృష్ణ అధ్యక్షత వహించారు. సిఐటియు జిల్లా కార్యదర్శి జె.నాగేశ్వరరావు, సిఐటియు నగర ఉపాధ్యక్షులు కె.సుధాకరప్ప మాట్లాడుతూ గత వారం రోజులుగా తమిళనాడు రాష్ట్రంలో శాంసంగ్ కార్మికులు తమకు జీతాలు పెంచాలని, కార్మికులపై వేధింపులు ఆపాలని, పని గంటలు తగ్గించాలని కోరుతూ చేస్తున్న సమ్మెను జయప్రదం చేయాలని సిఐటియు అన్ని రాష్ట్రాలలో ఆందోళన కార్యక్రమాలు చేపట్టిందని తెలిపారు. శాంసంగ్ కార్మికులను సిఐటియుగా గుర్తించాలని చేస్తున్న విన్నపాన్ని ఆ యాజమాన్యం ఏమాత్రం పట్టించుకోవడంలేదని తెలిపారు. అలాగే కార్మికులను వేధింపులకు గురి చేస్తూ అదనపు పనులు చేయాలని వేధిస్తున్నారని, ఈ వేధింపులను తాళలేక కార్మికులు సమ్మెబాట పట్టారని వారు తెలిపారు. కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన నూతన లేబర్ కోడ్ల వల్ల ప్రైవేట్ యాజమాన్యాలు కూడా కార్మికుల పట్ల నిర్లక్షిణ్యంగా వ్యవహరిస్తున్నాయని, పని గంటలు పెంచుతున్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. తమిళనాడులో శాంసంగ్ కార్మికులకు అండగా దేశవ్యాప్తంగా సిఐటియు ఉంటుందని వారు తెలిపారు. కేంద్ర ప్రభుత్వం జోక్యం చేసుకొని వెంటనే వారి జీతాలను పెంచి వేధింపులను ఆపాలని డిమాండ్ చేశారు. ఆటో యూనియన్ నాయకులు మాలిక్ భాషా, రవి, కాశిం, జయన్న, రాజు, చిన్న మాలిక్ బాషా, భవన నిర్మాణ సంఘం నాయకులు జి.ఏసు, బతుకన్న పాల్గొన్నారు.

అక్రమార్కుల పైన క్రిమినల్ కేసులు నమోదు చేయాలి

ఓర్వకల్ తహశీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా

ధర్నానుద్దేశించి మాట్లాడుతున్న జి.రామకృష్ణ

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

శకునాల గ్రామం లోని శ్రీకాశీవిశ్వేశ్వర దేవాలయానికి సంబంధించిన భూములను తవ్వేసిన వారిపై వెంటనే క్రిమినల్ కేసులు నమోదు చేయాలని ఎపి రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జి .రామకృష్ణ డిమాండ్ చేశారు. బుధవారం ఓర్వకల్లు తహశీల్దార్ కార్యాలయం ముందు ఎపి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి బి నాగన్న అధ్యక్షతన ధర్నా నిర్వహించారు. జి రామకృష్ణ, రైతు సంఘం మండల కార్యదర్శి చంద్రబాబు నాయుడు, సిఐటియు మండల కార్యదర్శి షాజహాన్, రైతు సంఘం నాయకులు వెంకటేశ్వర్లు పాల్గొన్నారు. జి.రామకృష్ణ మాట్లాడుతూ ఓర్వకల్లు మండలంలో దేవుని ఆస్తులు, భూములు మాన్యాలు కాపాడటంలో దేవాదాయ శాఖ ఉన్నతాధికారులు విఫలమయ్యారన్నారు. శకునాల గ్రామంలో ఆలయ భూములు 18 ఎకరాలలో 10 నుండి 15 అడుగుల లోతు గుంతలు తవ్వేసి సోలార్ పరిశ్రమకు ప్రైవేటు వెంచర్లకు విచ్చలవిడిగా అమ్ముకున్న కాంట్రాక్టర్లపై చర్యలు తీసుకోవడంలో గత ప్రభుత్వం విఫలం చెందిందన్నారు. నూతనంగా ఏర్పడిన కూటమి ప్రభుత్వమైనా చర్యలు చేపట్టి అక్రమార్కులపై నాన్ బెయిలబుల్ కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. కాల్వబుగ్గ రామేశ్వర ఆలయానికి వచ్చిన ఆదాయాన్ని మింగేసిన వారిపై సమగ్రమైన విచారణ జరిపించాలన్నారు. ఆలయానికి వచ్చిన రకరకాల ఆదాయాన్ని అవినీతికి పాల్పడడం దుర్మార్గమన్నారు. తక్షణమే అవినీతి అక్రమాల పైన భూముల తవ్వకాలపైన జిల్లా కలెక్టర్ జోక్యంతో విచారణ చేయించాలన్నారు. అనంతరం తహశీల్దార్ విద్యాసాగర్‌కు వినతిపత్రం అందజేశారు. తహశీల్దార్ స్పందించి విచారణ జరిపి తగు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. నాయకులు చాంద్ బాషా, మాసుం బాష, నాగరాజు, భాస్కర్, దస్తగిరి, మల్లికార్జున, శేఖర్ పాల్గొన్నారు.

సమస్యలను గాలికొదిలిన అధికారులు, నాయకులు : సిపిఎం

ప్రజాశక్తి - సి బెళగల్ : ప్రజాసమస్యలను అధికారులు, నాయకులు గాలికొదిలేశారని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కెవి నారాయణ, జిల్లా కమిటీ సభ్యులు జె.మోహన్ విమర్శించారు. బుధవారం సి.బెళగల్‌లో మండల ముఖ్య కార్యకర్తల సమావేశంలో వారు మాట్లాడారు. సిబెళగల్‌లోని గుడిసె వీధిలో తాగునీరు లేక అవస్థలుపడుతున్నారన్నారు. కేజీబీవీ నుండి మోడల్ స్కూల్ వరకు రోడ్డు విస్తరణ, డివైడర్ పనులు, బస్టాండ్ అభివృద్ధి, బస్టాండ్‌లో మరుగుదొడ్లు లేవన్నారు. మార్కెట్ యార్డును వెంటనే ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. బాలికల వసతితో డిగ్రీ, పాలిటెక్నిక్ కళాశాలలు ఏర్పాటు చేయాలన్నారు. చెరువు, రిజర్వాయర్, కార్మికులకు ఇళ్ల స్థలాలు, ఇళ్ల నిర్మాణాలు వంటివి ఇచ్చి తీరాలని డిమాండ్ చేశారు. పోలకల్ నుండి ఎమ్మిగనూరు వరకు డబుల్ రోడ్డు, గుండ్రేవుల డ్యామ్ కల నెరవేర్చాలని, మండలంలో ప్రతి పల్లెకు రోడ్డు అభివృద్ధి చేయాలని కోరారు. సి బెళగల్ కేంద్రంలో 50 పడకల ఆసుపత్రి ఏర్పాటు చేయాలన్నారు. సి.బెళగల్ మండల అభివృద్ధిచేయడంలో అధికారులు, ప్రజాప్రతినిధులు విఫలమయ్యారని, ఐక్య ఉద్యమాలతో వారిని మేలుకొలుపాలని కోరారు. సి.బెళగల్ శాఖ కార్యదర్శి ఇబ్రహీం, నాయకులు రంగన్న, అక్బర్, సుందరాజు, రాముడు, మంగమ్మ, మద్దిలేటి, పురుషోత్తం, ఉషారాణి, లింగన్న, రామాంజినేయులు పాల్గొన్నారు.

బన్ని ఉత్సవం ప్రశాంతంగా జరుపుకోవాలి

- దేవరగట్టు పరిసర గ్రామాల్లో కార్డన్ సెర్చ్ ఆపరేషన్ - ఎస్‌పి జి.బిందు మాధవ్

ప్రజాశక్తి - కర్నూలు క్రైమ్

దసరా పండుగను పురస్కరించుకొని అక్టోబర్ 12 రాత్రి జరిగే దేవరగట్టు శ్రీ మాలమల్లేశ్వర స్వామి బన్ని ఉత్సవం ప్రశాంతంగా నిర్వహించుకోవాలని జిల్లా పోలీసు యంత్రాంగం అన్ని రకాల భద్రతా చర్యలు చేపట్టిందని కర్నూలు జిల్లా ఎస్‌పి జి. బిందు మాధవ్ బుధవారం తెలిపారు. బన్ని ఉత్సవానికి 800 మంది పోలీసులతో పటిష్ట భద్రత ఏర్పాట్లు చేశామన్నారు. ఇందులో 7 మంది డిఎస్పీలు, 42 మంది సిఐలు, 54 మంది ఎస్సైలు, 112 మంది ఎఎస్సైలు, హెడ్ కానిస్టేబుళ్ళు, 362 మంది కానిస్టేబుళ్ళు, 50 మంది స్పెషల్ పార్టీ పోలీసులు, 3 ప్లటూన్ల ఎఆర్ పోలీసులు, 95 మంది హోంగార్డులు బన్ని ఉత్సవం బందోబస్తు విధులలో పాల్గొంటారని తెలిపారు.శాంతి భద్రతలకు విఘాతం కలిగించే వారిపై జిల్లా పోలీసు యంత్రాంగం గట్టి నిఘా ఏర్పాటు చేసిందన్నారు. బన్ని ఉత్సవంలో ఎవరైనా నిబంధనలు ఉల్లంఘించి, అల్లర్లు, నిప్పులు విసరడం వంటివి చేస్తే అలాంటి వారిపై చట్ట ప్రకారం కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసు కుంటా మన్నారు. బన్ని ఉత్సవంలో మద్యం సేవించి రింగు కర్రలతో ఉత్సవంలో పాల్గొనడం వల్ల తలలకు గాయాలు కావడం వంటి దుష్ప రిమాణాలపై దేవరగట్టు చుట్టు ప్రక్కల నెరణికి, కొత్తపేట, అరికెర, ఎల్లార్తి, గ్రామాలలో పోలీసు ,రెవిన్యూ శాఖల సమన్వయంతో ప్రజల్లో చైతన్యం తెచ్చేందుకు అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నామని తెలిపారు. దేవరగట్టు పరిసర గ్రామాల్లో కార్డన్ సెర్చ్ ఆపరేషన్‌లు నిర్వహిస్తున్నా మన్నారు. ముందు జాగ్రత్తల చర్యల్లో భాగంగా ఇంతకు మునుపు ఘర్షణల్లో పాల్పడ్డ వారిని, అక్రమ మద్యం రవాణా చేసే వారిని గుర్తించి 148 మందిని బైండోవర్ చేసి అదుపులోకి తీసుకున్నామని పేర్కొన్నారు. దేవరగట్టు చేరుకునే పరిసర గ్రామాల్లోనూ, ప్రధాన రహదారుల్లోనే కాక చిన్న చిన్న దారుల్లోనూ బందోబస్తు, చెక్ పోస్టులు ఏర్పాటు చేసి తనిఖీలు నిర్వహి స్తున్నామని తెలిపారు. ఉత్సవంలో ఎలాంటి రక్త గాయాలు కాకుండా పూర్తిగా అదుపులోకి తీసు కువచ్చేందుకు కృషి చేస్తా మన్నారు. బన్ని ఉత్సవంలో ఫైర్ సిబ్బంది, వైద్యసిబ్బంది, అంబులెన్స్ సర్వీసులు అందుబాటులో ఉండే విధంగా చర్యలు తీసుకున్నా మన్నారు. బన్ని ఉత్సవం ప్రశాంతంగా జరిగేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని, భక్తుల్లో మార్పు రావాలని, ఈ కర్రల సమరానికి స్వస్తి పలకాలని దేవరగట్టు పరిసర ప్రాంతాల ప్రజలకు ఎస్పీ విజ్ఞప్తి చేశారు.

అబ్దుల్ కలాం పురస్కారానికి అన్వర్ హుస్సేన్

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

ఉస్మానియా కళాశాల తెలుగు శాఖ అధ్యక్షులు డాక్టర్ మండి అన్వర్ హుస్సేన్ డాక్టర్ ఎపిజె అబ్దుల్ కలాం జాతీయ ప్రతిభా పురస్కారానికి ఎంపికయ్యారని ఎస్‌పిఎల్‌టిఎ గౌరవ అధ్యక్షులు, ఎమ్మెల్సీ కెఎస్‌లక్ష్మణరావు, అధ్యక్షులు డాక్టర్‌పి.నాగయ్య ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 20న గుంటూరులో నిర్వహించే ప్రత్యేక కార్యక్రమంలో ఎంపికైన వారికి అవార్డు ప్రదానం చేస్తామని తెలిపారు. డాక్టర్ మండి అన్వర్ హుస్సేన్ అధ్యాపకులుగా 29 సంవత్సరాల అనుభవంతో పాటు వివిధ స్థాయిలలో ఎన్ఎస్ఎస్, ఎన్‌సిసి అధికారిగా సామాజిక సేవా కార్యక్రమాలలో చురుగ్గా పాల్గొన్నారు.

నేడు ప్రత్యేక ఆధార్ నమోదు

ప్రజాశక్తి - కర్నూలు కార్పొరేషన్

జాతీయ తపాలా వారోత్సవాల్లో భాగంగా గురువారం కర్నూలు ప్రధాన తపాలా కార్యాలయంలో, పత్తికొండ , డోన్ , ఎమ్మిగనూరు తపాలా కార్యాలయాలలో ప్రత్యేక ఆధార్ నమోదు కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్లు పోస్టల్ పర్యవేక్షకులు జి.జనార్ధనరెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 8 గంటల నుండి సాయంత్రం 7 గంటల వరకు ఈ కేంద్రాలు ఉంటాయని తెలిపారు. సవరణలు, కొత్తగా నమోదు, ఫోన్ నంబర్ లింక్, పేర్లు, చిరునామాల మార్పులు చేసుకోవచ్చని వివరించారు. ప్రజలందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

సమస్యల పరిష్కారానికి అధికారులు కృషి చేయాలి

ప్రజలకు సేవ చేయడమే కూటమి ప్రభుత్వ లక్ష్యం
పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి



ప్రజాశక్తి కర్నూలు హాస్పిటల్

ప్రజా సమస్యలను పరిష్కరించేందుకు అధికారులు బాధ్యతాయుతంగా పనిచేయాలని ఎమ్మెల్యే గౌరు చరిత రెడ్డి అన్నారు. కల్లూరు మండల సర్వసభ్య సమావేశం ఎంపిపి బి.శారద అధ్యక్షతన నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత రెడ్డి హాజరయ్యారు. మండల అధికారులు ఆయా శాఖల ప్రగతి నివేదికలను, సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు. వాటిని వెంటనే పరిష్కరించేందుకు కృషి చేస్తామని అధికారులకు తెలిపారు. విద్యాశాఖ అధికారి శ్రీనివాసులు మాట్లాడుతూ కల్లూరు మండల పరిధిలో 83 ప్రభుత్వ స్కూల్లో 216 ప్రైవేట్ స్కూళు ఉన్నాయని తెలిపారు. మనబడి మన భవిష్యత్తు కింద 54 పాఠశాలలు ఉన్నాయని, వాటిలో పర్ల గ్రామంలో ఉపాధి హామీ కింద చేస్తున్న పని ఆగిపోయిందని ఎమ్మెల్యే దృష్టికి తీసుకు వచ్చారు. ఆ వర్క్ ను వెంటనే కంప్లీట్ చేస్తామని తెలిపారు. ఇందిరా క్రాంతి పథకం కింద మహిళలు ఆర్థికంగా ఎదగాలని ప్రభుత్వం రూ. లక్ష సబ్సిడీకి 35 శాతం చెల్లించేందుకు అవకాశం కల్పిస్తున్నారని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎపిఎం పుష్పావతి తెలిపారు. అగ్రికల్చర్ ఎఒ శ్రీనివాస్ రెడ్డి మార్కాపురంలో రెండు నెలల నుంచి పశు వైద్యశాల తెరవడం లేదని, మార్కాపురం సర్పంచి గణ మద్దిలేటి ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు. పంచాయతీ రాజ్ అధికారి నగేష్ మాట్లాడుతూ ఇదివరకే ఈ మండలంలో పంచాయతీ కార్యదర్శిగా పనిచేశానని, మళ్ళీ ఇప్పుడు ప్రమోషన్ మీద ఈ మండలానికి వచ్చానని మండలంలోని సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానని తెలిపారు. కల్లూరు మండలంలో 18 గ్రామాలకు గాను 15 గ్రామాలలో షెడ్లుఉన్నాయని, మిగిలిన గ్రామాలలో షెడ్లు ఏర్పాటు చేస్తామని ఎమ్మెల్యేకు తెలిపారు.అనంతరం ఎమ్మెల్యే గౌరు చరిత రెడ్డి మాట్లాడుతూ మండలంలో సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేయాలని అధికారులకు సూచించారు. పాణ్యం మండలంలో ఏ ఊరికి వెళ్ళినా మా స్థలం కబ్జా అయిందని ప్రతి ఒక్కరూ మొరపెట్టుకుంటున్నారని, గత ప్రభుత్వం ఇలా చేసిందని ప్రజలు వందల అర్జీలను మా దృష్టికి వస్తున్నాయని వాటిని పరిష్కరిష్కరించేందుకు కృషి చేస్తామని తెలిపారు. గ్రామాలలో డ్రైనేజీలను, సిసి రోడ్లను, తాగునీరుకు డబ్బులను వాడుకోవాలని అధికారులకు తెలిపారు. ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఆదేశాల మేరకు ఆంధ్రప్రదేశ్లో ఒకరోజు 13320 గ్రామాలలో గ్రామ సభలు విజయ వంతంగా నిర్వహించామని ఆమె తెలిపారు. ఎంపిడిఒ, తహశీల్దార్ ఆయాశాఖల అధికారులు, ఎంపిటిసిలు, సర్పంచులు పాల్గొన్నారు

వెలుగు ఎపిఎంగా రమేష్ బాధ్యతలు

ప్రజాశక్తి - సి బెళగల్

సి బెళగల్ మండలం వెలుగు ఎపిఎంగా రమేష్ బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఆ వెంటనే కార్యాలయంలో సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించి మాట్లాడారు. పొదుపు గ్రూపులను అభివృద్ధి చేసి, మహిళలను రాణించేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. సిబ్బంది విధుల్లో అలసత్వం తగదన్నారు.

సిఎం హామీలను నెరవేర్చాలి : కలెక్టర్

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

పత్తికొండ మండలం పుచ్చకాయలమాడ గ్రామంలో ముఖ్యమంత్రి పర్యటన సందర్భంగా ఇచ్చిన హామీలను నెరవేర్చేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం ముఖ్యమంత్రి హామీల సాధన పై కూడా కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ హౌసింగ్‌కు సంబంధించి 203 దరఖాస్తులు వచ్చాయని, వాటిని మంజూరు చేసేందుకు తగిన చర్యలకు ఆదేశించారు. 40 మందికి ఇళ్ళ స్థలాల మంజూరుకు కూడా భూమిని గుర్తించాలని కలెక్టర్ డిఆర్ఒను అదేశించారు. ఎన్‌టిఆర్ భరోసా పెన్షన్‌కు సంబంధించి 48 దరఖాస్తులు వచ్చాయని, వీటిని మంజూరు చేసేందుకు సెర్ప్ సిఇఒకు పంపాలని ఆదేశించారు.

నాణ్యమైన విత్తనాలు అందించడమే లక్ష్యం

- టిడిపి ఇంఛార్జి వీరభద్ర గౌడ్

ప్రజాశక్తి - ఆస్పరి

అన్నదాతలకు నాణ్యమైన విత్తనాలు అందించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని ఆలూరు టిడిపి ఇంచార్జ్ వీరభద్ర గౌడ్ అన్నారు. బుధవారం మండల కేంద్రమైన ఆస్పరిలోని రైతు భరోసా కార్యాలయం ఆవరణంలో నిర్వహించిన పప్పు శనగ విత్తనాలు పంపిణీ కార్యక్రమంలో భాగంగా టిడిపి ఇన్చార్జి వీరభద్ర గౌడ్ పాల్గొని అన్నదాతలకు ప్రభుత్వం అందించిన సబ్సిడీ శనగ విత్తనాలను పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ మార్కెట్లో రూ.9,400 ఉండగా ప్రభుత్వం రైతులకు రూ.7,050 అంటే 25 శాతం రాయితీతో అందిస్తుందన్నారు. సకాలంలో వర్షాలు కురుస్తుండడంతో రైతులలో ఆనందం కనిపిస్తుందన్నారు. ఈ అవకాశాన్ని ప్రతి రైతు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ముందుగా టిడిపి నాయకులు వీరభద్ర గౌడ్‌కు శాలువా కప్పి

విత్తనాలను పంపిణీ చేస్తున్న టిడిపి ఆలూరు ఇంఛార్జి వీరభద్ర గౌడ్

పూలమాలలతో సన్మానించారు. బిజెపి ఆలూరి ఇంచార్జి వెంకట రాముడు, ఏడిఏ సునీత, జడ్పిటిసి దొరబాబు, సర్పంచ్ రాధమ్మ, టిడిపి మండల కన్వీనర్ పరమ రెడ్డి, ప్రధాన కార్యదర్శి శేషాద్రి నాయుడు, మాజీ మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ సాలి సాహెబ్, మాజీ మండల కన్వీనర్లు తిమ్మన్న, శ్రీనివాస్ గౌడ్ పాల్గొన్నారు.

సామాజికవేత్త ఆల్ఫ్రెడ్ రాజుకు సన్మానం

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

మల్లెల గ్రూప్స్ అధినేత సామాజికవేత్త డాక్టర్ మల్లెల ఆల్ఫ్రెడ్ రాజు, సునీలమ్మ దంపతులకు ఘనంగా సన్మానించారు. బుధవారం కుర్నీ ఫంక్షన్ హాల్ నందు పూలే అంబేద్కర్ ఎడ్యుకేషనల్ సొసైటీ అధ్యక్షురాలు ప్రతిభ భారతి, సామాజిక సేవకుడు, మార్కెట్ యార్డ్ సూపర్వైజర్ యు రాము ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. మహనీయుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కాన్సిరాం వర్ధంతి, మల్లెల సునీలమ్మ పుట్టినరోజు వేడుకలు, స్థలం దాత యు రాము పూలే అంబేద్కర్ ఎడ్యుకేషనల్ సొసైటీ అమ్మ నాన్న వృద్ధాశ్రం కోసం భూమి పూజ కార్యక్రమాలు నిర్వహించారు. ఆల్ఫ్రెడ్ రాజు మాట్లాడుతూ నిన్ను వలే నీ పొరుగు వారిని ప్రేమించు అన్న మాటకు తను చేసిన సేవలు ద్వారా తనకు మంచి పేరు కంటే ఆత్మకు సంతృప్తినిచ్చాయని తెలిపారు. కార్యక్రమంలో జై భీమ్ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షులు చిక్కం జానయ్య, టిడిపి నాయకులు కదిరి కోట ఆదెన్న, రిటైర్డ్ టీచర్ ఏపీ ఈరన్న, పిఏఈఎస్ కమిటీ సభ్యులు యు రాము, మార్కెట్ యార్డ్ సూపర్వైజర్ ప్రసాద్, మనోహర్, నరసన్న, జనసేన నాయకులు రామకృష్ణ, లక్ష్మన్న, నాగరాజు పాల్గొన్నారు.

ఆల్ఫ్రెడ్ రాజును సన్మానిస్తున్న అతిథులు

రాయితీ పప్పుశనగ విత్తనాలను సద్వినియోగం చేసుకోవాలి

- ఎమ్మెల్యే పార్థసారధి

ప్రజాశక్తి-ఆదోని రూరల్

రాయితీ పప్పు శనగను రైతులు వినియోగించుకోవాలని ఆదోని ఎమ్మెల్యే పార్థసారధి తెలిపారు. బుధవారం మార్కెట్ యార్డ్‌లో వ్యవసాయ శాఖ ఏడిఏ అరుణ దేవి, మార్కెట్ యార్డ్ అసిస్టెంట్ కార్యదర్శుల ఆధ్వర్యంలో సబ్సిడీలో పప్పు సెనగ పంపిణీ చేపట్టారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ సన్న, చిన్న కారు రైతుల కోసం ఆ నాణ్యమైన ఈ విత్తనాలను ఇవ్వడం జరుగుతుందని, వీటిని రైతులు తీసుకొని సద్విని చేసుకోవాలన్నారు. ఇప్పటికే ప్రధాని నరేంద్ర మోడీ దేశ వ్యాప్తంగా ఎనిమిది సార్లు రైతులకు పంటల ఉత్పత్తులపై ధరలు పెంచారన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

పల్లె పండుగ'ను విజయవంతం చేద్దాం

టిడిపి మాటల ప్రభుత్వం కాదని, చేతల ప్రభుత్వమని ఎమ్మెల్యే పార్థసారథి అన్నారు. బుధవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పడి నాలుగు నెలల్లో ఒక పక్క సంక్షేమంతో పాటు, మరో పక్క అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నామని అన్నారు. మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పల్లె పండుగ వారోత్సవాలను ఈనెల 14 నుండి 21వ తేదీ వరకు

- రాయితీ పప్పుశనగ విత్తనాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే పార్థసారధి

గ్రామాలలో కార్యక్రమాలు కొనసాగుతాయన్నారు. ఆదోని మండలంలో 24 గ్రామాల్లో 30 రకాల వివిధ పనులకు 2 కోట్ల రూపాయలు కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు కేటాయించినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, ప్రజలు స్వచ్ఛందంగా పాల్గొనాలని గ్రామాల అభివృద్ధి వైపు అడుగులు వేయాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీడీవో రాజేంద్రప్రసాద్, పంచాయతీరాజ్ డిఇ రాణి, ఈవోపీఆర్డి జనార్ధన, ఇంచార్జ్ ఏపీవో కలీక్ పాల్గొన్నారు.

కాలనీలో సమస్యల పరిష్కారానికి కృషి

ప్రజాశక్తి - ఆదోని

ఆదోని పట్టణంలోని విజయనగర్ కాలనీలో రోడ్లు ఇతర సదుపాయాలు ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని టిడిపి తెలుగు యువత నాయకుడు మారుతి నాయుడు తెలిపారు. బుధవారం కాలనీవాసులు కృష్ణ, విజయ్, రసూల్, ఖాసిం ఆయనకు పూలమాలలతో సన్మానం చేశారు. ఈ సందర్భంగా వార్డ్ ఇన్చార్జి అమర్ ప్రకాష్ కాలనీవాసులు మాట్లాడుతూ ఇటీవల కురిసిన భారీ వర్షాల వల్ల విజయనగర్ కాలనీ నీటిమయం అయిందని, రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడ్డామన్నారు. విజయనగర్ కాలనీ టిడిపి యూత్ కార్యకర్తలు వెళ్లి మారుతి నాయుడుకు సమస్యను విన్నవించామన్నారు. స్పందించిన ఆయన టిప్పర్ల ద్వారా ఎర్ర మట్టి గరుసు వేయించడం

జరిగిందన్నారు. కాలనీ మొత్తం రోడ్లకు గ్రావెల్ వేయించి రోలర్తో చదును పనులు చేయించారన్నారు. విజయనగర్ కాలనీ ప్రజల తరపున మారుతి నాయుడుకు కృతజ్ఞతలు తెలిపారు.

వేతనాలు రాలేదు

- దసరా పండుగ ఎలా చేసుకోవాలి- మున్సిపల్ కార్మికుల ఆవేదన

ప్రజాశక్తి - ఆదోని

పండుగలలో ప్రముఖమైనది దసరా. కుటుంబ సమేతంగా కొత్త బట్టలు ధరించి, పిండి వంటలు ఆరగించి సంతోషంగా పండుగ జరుపుకోవడం ఆనవాయితీ, వేతనాలు నిలిపివేయడంతో దసరా పండగ ఎలా జరుపుకోవాలి అంటూ మున్సిపల్ ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆదోని మున్సిపల్ కార్యాలయంలో ఇంజనీరింగ్, వాటర్ సప్లయ్ విభాగంలో కాంట్రాక్ట్ అవుట్ సోర్సింగ్ తరహాలోనే ఎన్ఎంఆర్ పద్ధతిలో విధులు నిర్వహిస్తున్నారు. 16 మంది దశాబ్ద కాలంగా ఉద్యోగం చేస్తున్నారు. రెగ్యులర్ ఉద్యోగుల విధులకు ఏమాత్రం తీసుపోని విధంగా డ్యూటీ చేస్తున్నారు. వారు రెగ్యులర్ కోసం దశాబ్ద కాలంగా ప్రభుత్వంతో న్యాయపోరాటం చేస్తూనే ఉన్నారు. వారికి నెల నెలా వేతనం సరిపడా బిల్లు అకౌంట్ ఆఫీసర్ లాగిన్ నుండి మున్సిపల్ కమిషనర్, జిల్లా కలెక్టర్‌కు చేరుతుంది. ప్రతినెల 5వ తేదీలోగా వేతనాలు అకౌంట్లో జమ కావాల్సి ఉంది. అధికారుల సమన్వయం లోపం సాంకేతిక నిర్లక్ష్యం కారణంగా బిల్లు అధికారులకు చేరలేదు. దీంతో ఈనెల వేతనం అకౌంట్ కు ఇంతవరకు జమ కాలేదని ఉద్యోగులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. వచ్చే అరకోర వేతనం కూడా సక్రమంగా ఇవ్వకపోవడం ఏమిటని నిలదీస్తున్నారు. మున్సిపాలిటీ పరిధిలోని పాఠశాలలు, కార్యాలయంలో కాంట్రాక్ట్ పద్ధతిన పనిచేసే స్వీపర్లు, మరుగుదొడ్ల శుభ్రం చేసే వారికి రూ.4వేలు ఇస్తున్నారు. వారికి కూడా కొందరు ప్రధానోపాధ్యాయుల నిర్లక్ష్యం కారణంగా వేతనం రాలేదు. చిన్న ఉద్యోగుల పట్ల ఇంత నిర్లక్ష్యం చేయడం సబబు కాదంటూ మండిపడుతున్నారు. ఇప్పటికైనా ఉన్నత ఉద్యోగులు నిర్లక్ష్యం వీడి నెలనెలా వేతనం బిల్లులు చేయాలని కోరుతున్నారు.

ధర్నా చేపడతాం

- ఈరన్న, మున్సిపల్ ఉద్యోగుల యూనియన్ గౌరవ అధ్యక్షుడు

వేలకు వేలు వేతనం తీసుకునే అధికారులు చిరు ఉద్యోగుల పట్ల నిర్లక్ష్యం విడాలి. ఉదయం నుండి సాయంత్రం వరకు కార్యాలయంలో పని చేయించుకుంటున్న అధికారులు వారికి వేతనాలకు సంబంధించిన బిల్లు చేయడంలో మాత్రం నిర్లక్ష్యం చేయడం తగదు. ఇప్పటికైనా నెల నెల వేతనాలు అకౌంట్లో జమ అయ్యేలా చూడాలి. లేనియెడల మున్సిపల్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహిస్తాం.

ప్రోటోకాల్ పాటించడం లేదు

- ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తాం - కౌన్సిలర్ లలితమ్మ

ప్రజాశక్తి-ఆదోని రూరల్

ఆదోని మార్కెట్ సెక్రటరీ రామ్మోహన్ రెడ్డి గత నియంతల ప్రభుత్వంలో పనిచేసిన అలవాట్లు మార్చుకోవాలని అమరావతి నగర్ 35వ వార్డు కౌన్సిలర్ వెల్లాల లలితమ్మ డిమాండ్ చేశారు. బుధవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ గత వారంలో రైతులకు రూ.5 భోజనం కార్యక్రమానికి ఎమ్మెల్యేను, చైర్మన్‌ను ఆహ్వానించినప్పటికీ కౌన్సిలర్‌కు పిలుపు లేదన్నారు. బుధవారం మార్కెట్ యార్డులో జరిగిన పప్పుశనగ పంపిణీ ప్రభుత్వ అధికారిక కార్యక్రమానికి సైతం పిలవకపోడం మార్కెట్ యార్డు సెక్రటరీ రామ్మోహన్ రెడ్డి, వ్యవసాయ అధికారిణి ఎడిఎ అరుణ కుమారి నియంతృత్వ ధోరణికి నిదర్శనంగా భావిస్తున్నానన్నారు. మార్కెట్ యార్డు ఆదోని మున్సిపాలిటీ పరిధిలోని 35వ అమరావతి నగర్ వార్డు పరిధిలోకి వస్తుందని, ప్రభుత్వ కార్యక్రమాలు ఏవి జరిగినా కౌన్సిలర్‌కు కనీస సమాచారం కూడా ఇవ్వకుండా, ప్రజాప్రతినిధినైన తనను తీవ్రంగా అవమానం పరుస్తున్నారని లలితమ్మ ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయాన్ని ఎమ్మెల్యే పార్థసారథికి, జాయింట్ కలెక్టర్, జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకు వెళతానన్నారు. మార్కెట్ యార్డ్ సెక్రటరీ రామ్మోహన్ రెడ్డిని వివరణ కోరగా అలాంటిదేమీలేదని, ప్రతి కార్యక్రమానికి ప్రోటోకాల్ పాటిస్తూ ప్రతి ఒక్కరిని ఆహ్వానిస్తున్నామని, గతవారం జరిగిన కార్యక్రమంలో గుంటూరు నుంచి హుటాహుటిన ఆదోనికి రావడంలో కొందరు అధికారులను, కౌన్సిలర్లను మర్చిపోయామని, అలా జరగకుండా చూసుకుంటామని వివరణ ఇచ్చారు.

చట్టాలపై మహిళలకు అవగాహన అవసరం

- సివిల్ కోర్టు జడ్జి కె.హేమ

ప్రజాశక్తి - ఆలూరు

సమాజంలో అన్ని రంగాలలో విధులు నిర్వహిస్తున్న మహిళలు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని ఆలూరు సివిల్ కోర్టు జడ్జి కె.హేమ అన్నారు. బుధవారం ఆలూరులోని ఐసిడిఎస్ ప్రాజెక్టులో అంగన్వాడీ వర్కర్లకు మహిళ న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. జడ్జి కె.హేమ మాట్లాడుతూ సమాజంలో మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరణకు చట్టాలపై అవగాహన కలిగి ఉండి ధైర్యంగా ఎదుర్కోవాలన్నారు. కార్యక్రమంలో సిడిపిఓ మద్దమ్మ, సూపర్వైజర్ పద్మావతి, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు వాయు జీవోతమ రావు, కార్యదర్శి షేక్ షా వలి, సీనియర్ న్యాయవాది ప్రవీణ్ కుమార్, షాకీర్, ఎపిఎం ఆంజనేయులు పాల్గొన్నారు.

సదస్సులో మాట్లాడుతున్న సివిల్‌కోర్టు జడ్జి కె.హేమ

దిగుబడిపై రైతులకు అవగాహన ఉండాలి

- టిడిపి మండల కన్వీనర్ సుధాకర్

ప్రజాశక్తి - హాలహర్వి : మండలంలోని బేవినహాల్ స్థానిక రైతు సేవ కేంద్రం వద్ద రైతుల పొలాలకు క్షేత్ర సందర్శనతో పాటు పంటల సంరక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించేందుకు పొలం పిలుస్తోంది కార్యక్రమన్ని మండల వ్యవసాయ అధికారి శివశంకర్, టిడిపి మండల కన్వీనర్ సుధాకర్ నిర్వహించారు. స్థానిక రైతులతో కలిసి పొలాలను పరిశీలించిన అనంతరం గ్రామంలోని ప్రజలతో స్థానిక కొక్కరచేడు గ్రామంలోని రైతు సేవ కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. రైతులు పంటలు వేసింది మొదలు పంట నూర్పులు చేసేంతవరకు ఎప్పటికప్పుడు స్థానిక వ్యవసాయ అధికారుల సలహాలు. సూచనలు పాటిస్తే అధిక దిగుబడులు సాధించేందుకు అవకాశం ఉంటుందన్నారు. అనంతరం బివిన హాల్ గ్రామంలో రాయితీ పప్పు శనగ విత్తనాలు పంపిణీ చేశారు.

'పల్లె పండుగ' జయప్రదం చేద్దాం

- ఎంపిడిఒ అల్లా బకాష్

ప్రజాశక్తి - చిప్పగిరి

ప్రభుత్వ ఆదేశాలతో ఈనెల 14 నుంచి 20 వరకు జరుగు పల్లె పండుగ కార్యక్రమాన్ని జయప్రదం చేద్దామని ప్రజాప్రతినిధులకు, నాయకులకు అధికారులకు ఎంపిడిఒ అల్లాబకాష్ తెలిపారు. బుధవారం మండల కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఈనెల 14న ప్రారంభమయ్యే పల్లె పండుగ కార్యక్రమం 13 పంచాయతీల సర్పంచుల ఆధ్వర్యంలో రోజుకు రెండు పంచాయతీల ప్రకారం నిర్వహిస్తామన్నారు. గ్రామ సభలలో తీర్మానించబడిన ప్రాధాన్యత ఉన్న అభివృద్ధి పనులను ఈ పల్లె పండుగ కార్యక్రమంలో శంకుస్థాపన చేసి పనులను ప్రారంభిస్తారన్నారు. ప్రజా ప్రతినిధులతో పాటు పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది, మండల అధికారులు పాల్గొంటారన్నారు.

సరస్వతి అలంకరణతో మారెమ్మ దేవి

ప్రజాశక్తి - కౌతాళం

మండల పరిధిలోని ఉప్పరహాల్, వల్లూరు గ్రామాలలో దసరా ఉత్సవాల సందర్భంగా బుధవారం మరెమ్మ దేవి సరస్వతి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. గ్రామ ప్రముఖులు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

గృహ ప్రవేశ వేడుకల్లో ఎమ్మెల్యే

ప్రజాశక్తి మంత్రాలయం

ఎస్ఆర్ క్యాంటీన్ నిర్వాహకులు వేముల వారి వేణుగోపాల్ శెట్టి గృహ ప్రవేశ కార్యక్రమానికి ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి బుధవారం పాల్గొన్నారు. స్థానిక సుజయింద్రనగర్‌లో నూతనంగా నిర్మించిన గృహ ప్రవేశ ఆహ్వానం అందుకున్న ఆయన వైసిపి మండల అధ్యక్షులు జి భీమారెడ్డి గ్రామ సర్పంచ్ తెల్లబండ్ల భీమయ్య కు ఇతర నాయకులతో కలిసి హాజరు కాగా వారికి వేణుగోపాల్‌తో పాటు ఆయన సోదరులు నరసింహ ధనుంజయ్‌లు స్వాగతం పలికారు. ఈ నేపథ్యంలో ఎమ్మెల్యే సత్యనారాయణ స్వామి చిత్రపటాన్ని దర్శించుకొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమంలో ఉప సర్పంచి హొటల్ పరమేష్, ఎంపిటిసి సభ్యులు వెంకటేష్ శెట్టి, పెట్రోలు బంక్ శ్రీనివాసులు బొంబాయి శివ, రచ్చుమర్రి బొజ్జప్ప, ముఖ్య నాయకులు ఉన్నారు.

మార్కెట్‌యార్డును సందర్శించిన సబ్ కలెక్టర్

ప్రజాశక్తి-ఆదోనిరూరల్

ఆదోని పట్టణంలో ఉన్న మార్కెట్ యార్డును సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్ బుధవారం ఆకస్మికంగా సందర్శించారు. రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. మార్కెట్ యార్డులో అందిస్తున్న సేవలు గూర్చి ఆరా తీశారు. అనంతరం మార్కెట్ యార్డ్ పరిసరాలను తనిఖీ చేశారు. కార్యక్రమంలో పౌరసరఫరాల శాఖ ఉప తహశీల్దారు వలి భాష,మార్కెట్ యార్డ్ అసిస్టెంట్ సెక్రటరీ శాంత కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మార్కెట్ యార్డులో రైతులతో మాట్లాడుతన్న సబ్‌కలెక్టర్ మౌర్యభరద్వాజ్

ఉచిత ఇసుక విధానాన్ని అమలు చేయాలి : సిఐటియు

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్

కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన వాగ్దానం మేరకు ఉచిత ఇసుక విధానాన్ని వెంటనే అమలు చేయాలని సిఐటియు నాయకులు కోరారు. బుధవారం కల్లూరు సూర్యనారాయణ భవన్‌లో శరీన్‌నగర్ మట్టిపని కార్మికుల సమావేశం జి.ఏసు అధ్యక్షతన నిర్వహించారు. సిఐటియు నగర ఉపాధ్యక్షులు కె.సుధాకరప్ప మాట్లాడుతూ దసరా పండగ ముందర కార్మికులకు పని దొరకకుండా చేసిన ఘనత కూటమి ప్రభుత్వానిదే అని విమర్శించారు. ఎన్నికల ముందు ఉచితంగా ఇసుక సరఫరా చేస్తామని వాగ్దానం చేసిన ప్రభుత్వం ఆ మాటే మరచిందని ప్రస్తుతం ఇసుక బంగారంలా మారిపోయిందని ఇసుక తీసుకురావాలంటే ట్రాక్టర్ ఐదువేల నుంచి రూ.6000 ఖర్చు అవుతుందని తెలిపారు. గత ప్రభుత్వం అనుసరించిన విధానాన్ని ఈ ప్రభుత్వం కూడా అనుసరిస్తుందని వారు తెలిపారు. ఇసుక రీచ్‌లు స్టాక్ పాయింట్లు కూడా ఏర్పాటు చేయకుండా ఎక్కడో కౌతాళం మండలం దగ్గర ఏర్పాటుచేసిన గుడి కంబాల దగ్గర ఇసుక రీచ్ నుండి ఇసుక తీసుకుని రావాలంటే రవాణా చార్జీలు తడిసి మోపెడవుతున్నాయని తెలిపారు. మంత్రులు ఎమ్మెల్యేలు ఉచిత వాగ్దానాలు చేస్తున్నారు తప్ప ఉచిత ఇసుక ఊసే లేదని తెలిపారు. ఇసుక బుక్ చేసుకోవాలంటే కుస్తీ పట్టాల్సిన పరిస్థితి దాపురించిందని తెలిపారు.

ఇదే విధానం కొనసాగితే భవిష్యత్తులో భవన నిర్మాణ కార్మికులను సమీకరించి ప్రభుత్వ విధానానికి వ్యతిరేకంగా పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేస్తామని వారు హెచ్చరించారు. కార్యక్రమంలో ఎంజె ఈశ్వరమ్మ, శాంతమ్మలక్ష్మి, రామాంజనేయులు, వేణు, మద్దిలేటి పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమం టిడిపి ప్రభుత్వ లక్ష్యం

- సాగునీటి సంఘాల ఎన్నికల్లో గెలిపించండి

-టిడిపి, జనసేన, బిజెపి నాయకులు

ప్రజాశక్తి - కర్నూలు క్రైమ్

అభివృద్ధి సంక్షేమం టిడిపి లక్ష్యమని, ఉమ్మడి కర్నూలు జిల్లాలోని కెసి. కెనాల్, తుంగభద్ర ఎల్ఎల్‌సి, హంద్రీనీవా నీటిసంఘాల ఎన్నికలో టిడిపి, జనసేన, బిజెపి తరుపున పోటీచేస్తున్న అభ్యర్థులను గెలిపించాలని కర్నూలు పార్లమెంట్ టిడిపి అధ్యక్షులు పాలకుర్తి తిక్కారెడ్డి, మాజీ మంత్రి కెయి ప్రభాకర్, జనసేన జిల్లా అధ్యక్షులు సురేష్ కోరారు. బుధవారం జిల్లా టిడిపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ రాష్ట్రంలో టిడిపి, జనసేన, బిజెపి కూటమి ప్రభుత్వంగా నారా చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రిగా భాధ్యతలు చేపట్టిన తర్వాత అభివృద్ధి, సంక్షేమం రెండు సమదృష్టితో ముందుకు తీసుకొని వెళుతున్నారని తెలిపారు. అందువల్లనే రాష్ట్రంలోని ప్రజలు కూటమి ప్రభుత్వానికి తమ పూర్తి మద్దతు తెలుపుతున్నారనీ, ముఖ్యంగా గ్రామీణ ప్రాంత ప్రజలు ల్యాండ్ టైట్లింగ్ చట్టాన్ని రద్దు చేయడంతో ఆనందంగా ఉన్నారనీ తెలిపారు. సాగునీటి సంఘాల ఎన్నికలు రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపుకు నాంది కావాలనీ, గతంలో ఉమ్మడి రాష్ట్రంలో కర్నూలు జిల్లాలో స్థానిక సంస్థలలో టిడిపి జడ్పిటిసి స్థానాలను మొత్తం మూడొంతుల మెజార్టీసీట్లలో ఏకగ్రీవంగా గెలుచుకున్నామన్నారు. ఈ ఎన్నికలతో పాటు రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో ఏకగ్రీవంగా విజయం సాధించి చరిత్రను పునరావృతం చేయాలనీ విజ్ఞప్తిచేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు నంద్యాల నాగేంద్రకుమార్, కెయి జగదీష్, ఎల్వి ప్రసాద్ పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే సుస్థిర పాలన

ప్రజాశక్తి -ఆదోని

సుస్థిర పాలన కాంగ్రెస్‌తోనే సాధ్యమని, దేశ ప్రజలందరూ రాహుల్ గాంధీ నాయకత్వాన్ని కోరుకుంటున్నారని ఆ పార్టీ నియోజకవర్గ ఇన్చార్జి రమేష్ యాదవ్ ధీమా వ్యక్తం చేశారు. బుధవారం ఆదోని పట్టణంలో బాణాసంచా పేలుస్తూ మిఠాయిలు పంచుకుంటూ సంబరాలు చేసుకున్నారు. రమేష్ యాదవ్ మాట్లాడారు. జమ్మూ కాశ్మీర్ హర్యానా ప్రాంతాలలో జరిగిన ఎన్నికలలో కాంగ్రెస్‌కు మంచి ఫలితాలు వచ్చాయన్నారు. జమ్మూ కాశ్మీర్లో అధికారం దక్కించుకున్నామన్నారు. హర్యానాలో కాంగ్రెస్‌దే నైతిక విజయం అన్నారు. దేశ ప్రజలందరూ కాంగ్రెస్ వైపు చూస్తున్నారని, రానున్న కాలంలో అధికారం కాంగ్రెస్ దేనిని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు దేవిశెట్టి ప్రకాష్ దిలీప్ దోక, మారుతి తాయన్న, హనుమంతు తదితరులు పాల్గొన్నారు.

బాణసంచాపేల్చి సంబరాలు చేసుకుంటున్న కాంగ్రెస్‌నాయకులు

నేటి నుండి వర్సిటీకి దసరా సెలవులు

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

రాయలసీమ యూనివర్సిటీకి గురువారం నుండే దసరా సెలవులను ప్రకటిస్తూ వర్సిటీ రిజిస్టర్ వెంకటేశ్వర్లు బుధవారం ఉత్తర్వులను జారీ చేశారు. గురువారం వర్కింగ్ డే ఉన్నప్పటికీ నాన్ టీచింగ్ ఉద్యోగుల అభ్యర్థన మేరకు వైస్ ఛాన్సలర్ సెలవు ఇస్తూ ఆదేశించినట్లు ఆయన వెల్లడించారు.

బదిలీ సర్వసాధారణం

ప్రజాశక్తి - ఆదోని

విధి నిర్వహణలో ఉద్యోగులకు బదిలీలు సర్వ సాధారణమని మున్సిపల్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఇంతియాజ్ తెలిపారు. మున్సిపల్ ఏఈగా విధులు నిర్వర్తించి ప్రమోషన్‌పై అనంతపురంకు బదిలీ అయిన రాజశేఖర్ రెడ్డిని బుధవారం పూలమాలలతో ఘనంగా సన్మానించి వీడ్కోలు పలికారు. ఆయన అందించిన సేవలను పలువురు కొనియాడారు. కార్యక్రమంలో మున్సిపల్ డిప్యూటీ ఇంజనీర్లు చలపతి రెడ్డి, రామ్మూర్తి, ఉద్యోగులు పాల్గొన్నారు.

మహారాజశ్రీ కర్నూలు అడిషనల్ సీనియర్ సివిల్ జడ్జి కోర్టులో

EP.No.46/2024 in O.S.No.64/2016

ఎస్.తిమ్మారెడ్డి. ...డి.హెచ్.ఆర్

V/s

బి.రంగయ్య. ...జె.డి.ఆర్

వేలంప్రకటన

పై నంబరు ఇ.పి.లో డి.హెచ్.ఆర్ తనకు రావలసిన ఇ.పి. మొత్తం రాబట్టుకొనుటకు జె.డి.ఆర్ తాలుకు ఇ.పి.షెడ్యూల్ ఆస్థిని వేలమునకు తెచ్చినారు వేలం వాయిదా 25-10-2024 తేది ఉన్నది. సవాలుదారులు పై వేలం తేదీన పై కోర్టులో పగలు 10:30 గంటలకు స్వయంగా వేలంలో పాల్గొనవచ్చును.

షెడ్యూలు

కర్నూలు జిల్లా కోడుమూరు సబ్‌డివిజన్‌లో చేరిన చనుగొండ్ల గ్రామములోని ఆస్తి వివరం

1. S.No.692 ను. 1-33 సెంట్లు
తూ : బోయ శ్రీరాములు, బోయ రంగయ్య, బోయ వెంకటేశ్వర్లు భూమి
ప : బోయ మద్దయ్య, బోయ చిన్నయ్య భూమి
ఉ : పెద్ద నారాయణ, చిన్న నారాయణ భూమి
ద : గుర్రపు భూమి.
డి.హెచ్.ఆర్ విలువ : 2,50,000/-

2. S.No.696 ను. 1-15 సెంట్లు
తూ : బోయ రంగయ్య, బోయ వెంకటేశ్వర్లు భూమి
ప : బోయ శ్రీరాములు, బోయ రంగయ్య భూమి
ఉ : S.No.695 గవర్నమెంట్ భూమి
ద : S.No.697
డి.హెచ్.ఆర్ విలువ : 2,50,000/-
అమీనా విలువ : 12,00,000/-
సబ్ రిజిస్ట్రార్ విలువ : 5,00,000/-

కోర్టు ఉత్తర్వు మేరకు

వాయిదా తేది : 25-10-2024

P.V.RAMANA REDDY,
B.Sc., B.Ed., B.L.,
Advocate, Kurnool.
Cell : 9440205141


పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

సరస్వతి దేవిగా కాళికామాత

ప్రజాశక్తి - ఆళ్లగడ్డ

పట్టణంలోని విశ్వరూప నగర్‌లో ఉన్న కాళికామాత ఆలయంలో దసరా శరన్నవరాత్రి ఉత్సవాలు ఆలయ కమిటీ అధ్యక్షుడు ప్రముఖ శిల్పి దురుగడ్డ రవీంద్ర చారి, మహిళా కమిటీ అధ్యక్షురాలు దురుగడ్డ అనురాధ, కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో వైభవంగా జరుగుతున్నాయి. అందులో భాగంగా ఏడవ రోజు బుధవారం ఉదయం సుప్రభాతం, అభిషేకం అనంతరం ప్రధాన అర్చకులు చంద్రశేఖరఆచారి అమ్మవారిని పట్టు వస్త్రాలు, ఆభరణాలు వివిధ రకాల పుష్పాల చేత సరస్వతి దేవిగా అలంకరించారు. శిల్పిరత్న దురుగడ్డ రామకష్ణమాచార్యులు, వారి కుమారులు దురుగడ్డ జగదీశ్వర చారి ధర్మపత్ని పద్మావతి, దురుగడ్డ బాల మురళి ఆచారి ధర్మపత్ని పుష్పావతి, తునికి పాటి కోటేశ్వరరావు ఆచారి ధర్మపత్ని విజయలక్ష్మి ఉభయ దారులుగా వ్యవహరించి అమ్మవారికి పూజలు నిర్వహించారు. **కోవెలకుంట్ల :** కోవెలకుంట్ల పట్టణంలో వాసవి కన్యకా పరమేశ్వరి దేవాలయంలో దసరా నవరాత్రుల సందర్భంగా ఏడవ రోజు సరస్వతీ దేవి అలంకారంలో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం యువజన అధ్యక్షుడు కర్ణాటక సుబ్బారాయుడు, సముద్రాల సందీప్, భక్తులు పాల్గొన్నారు. **రుద్రవరం :** శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి దేవస్థానంలో అమ్మవారు సరస్వతి దేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. కార్యక్రమంలో పూజా దాతలు రాచమడుగు వెంకటేశ్వర్లు మరియు వారి కుటుంబ సభ్యులు, ఆర్యవైశ్య సంఘం ప్రెసిడెంట్ చోళవేటి సూర్యనారాయణ, కోశాధికారి పెరుమాళ్ళ నరసింహయ్య, సెక్రటరీ పాలూరు సుబ్రమణ్యం, లింగం వెంకట రంగనాయకులు, కమిటీ సభ్యులు, ఆర్యవైశ్యులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

మహిళ ఆత్మహత్య

ప్రజాశక్తి - బనగానపల్లె

మండలంలోని జిల్లెల్ల గ్రామానికి చెందిన ఇమ్మనబోయిన శకుంతల(35) ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్న ఘటన బుధవారం చోటు చేసుకుంది. నందివర్గం ఎస్ఐ వెంకటసుబ్బయ్య తెలిపిన వివరాల మేరకు.. జమ్మలమడుగుకు చెందిన శకుంతలకు జిల్లెల్ల గ్రామానికి చెందిన ఇమ్మనబోయిన బలరాముడుతో 17 సంవత్సరాల క్రితం వివాహం జరిగింది. వివాహం అయినప్పటి నుండి బలరాముడు తన భార్య శంకుతలను శారీరకంగా, మానసికంగా హింసించేవాడని, ఆ బాధను భరించలేక ఆత్మహత్య చేసుకున్నట్లు ఆమె తమ్ముడు కన్నె సుధాకర్ ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

విద్యుత్ మోటార్లు చోరీ

- వరుస దొంగతనాలతో తల్లడిల్లుతున్న అన్నదాతలు

ప్రజాశక్తి - రుద్రవరం

ఆరుగాలం కష్టపడి వ్యవసాయం చేస్తూ ఆహార ధాన్యాలు అందించే రైతన్నలకు విద్యుత్ మోటార్ల చోరీ సంఘటనలు ఆందోళన కలిగిస్తున్నదని బాధిత రైతులు ఆవేదన వ్యక్తం చేశారు .రుద్రవరం మండల పరిధిలోని పేరూరు చౌదలూరు రస్తా వైపు ఉన్నటువంటి పొలాలకు నీరు పెట్టుకునేందుకు ఏర్పాటు చేసిన విద్యుత్ మోటార్లు చోరీకి గురయ్యాయని రైతులు వాపోయారు. పేరూరు గ్రామానికి చెందిన శాగం కృష్ణా రెడ్డి తమ విద్యుత్ మోటార్లు చోరీకి గురైనట్లు తెలిపారు. గతంలో సైతం రైతులకు సంబంధించిన విద్యుత్ మోటార్లు చోరీకి గురయ్యాయని తిరిగి అపహరణకు గురి కావడం పట్ల రైతన్నలు ఆవేదన వ్యక్తం చేశారు. సుమారు రెండు లక్షల విలువ చేసే విద్యుత్ మోటార్లు చోరీకి గురైనట్లు వాపోయారు.

ఎలుకల నివారణ సామూహికంగా చేపట్టాలి

ప్రజాశక్తి - చాగలమర్రి

వరి పంటలో ఎలుకల బెడద తగ్గడనికి సామూహిక ఎలుకల నివారణ చేపట్టాలని జిల్లా వనరుల కేంద్రం వ్యవసాయ అధికారి ప్రభావతమ్మ,మండల వ్యవసాయ అధికారి రంగ నేతాజీ తెలిపారు. బుధవారం మండలంలోని కదిరిపురం తాండాలో రైతులు సాగు చేసిన వరి పంట పొలాలను క్షేత్ర స్థాయిలో పరిశీలించి ఎలుకల నివారణ మందు తయారీపై అవగాహన కల్పించారు. వారు మాట్లాడుతూ వరి పంటలో ఎలుకలు 20-25 శాతం పంట నష్టం కలిగిస్తాయన్నారు. నివారణకు పొలంలో ఎలుకల కన్నాలు గుర్తించి బియ్యపు నూకలు 96 శాతం, నూనె 2 శాతం, బ్రోమోడయోలిన్ 0.005 శాతం, మందు 2 శాతం చొప్పున కలుపుకొని విషపు ఎర తయారు చేసుకొని 10 గ్రాముల చొప్పున ఉంచాలన్నారు. అవసరాన్ని బట్టి 2-3 సార్లు వరి పైరు కంకి ఏర్పడక మునుపు చేయాలన్నారు. కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకులు, రైతులు పాల్గొన్నారు. **రుద్రవరం :** మండలంలోని పెద్ద కంబలూరు, ఎల్లావత్తుల గ్రామాలలోని రైతు సేవ కేంద్రాలలో మండల వ్యవసాయ అధికారి శ్రీకృష్ణ ఆధ్వర్యంలో వరి పంటలో ఎలుకల నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై రైతులకు అవగాహన కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఎలుకల నివారణకు 100 శాతం సబ్సిడీపై బ్రోమో డయోలిన్ 0.25 సిబి మందును, నూక, నూనెకు కలిపిన విషపు ఎరను రైతులకు పంపిణీ చేశారు. వ్యవసాయ విస్తరణ అధికారి రాజు, రైతు సేవ కేంద్రాల సిబ్బంది నవీన్ కుమార్ రెడ్డి, రేష్మ, రైతులు పాల్గొన్నారు. **ఆళ్లగడ్డ :** రైతులు సాగుచేసిన వరి పంటలో ఎలుకల నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై వ్యవసాయ అధికారి కిషోర్ కుమార్ రెడ్డి అవగాహన కల్పించారు. మండలంలోని నందింపల్లె, బాచేపల్లె గ్రామాలలో సామూహిక ఎలుకల నిర్మూలన కార్యక్రమం నిర్వహించారు. బ్రోమోడీలిన్ అనే ఎలుకల మందును రైతులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఏఈఓ, ఆర్ఎస్ కె సిబ్బంది పాల్గొన్నారు. **బండి ఆత్మకూర్ :** సల్ఫర్ ఆధారిత ఎరువుల వాడకాన్ని తగ్గించాలని, సల్ఫర్ వాడడంతో పంట పొలాల్లో వేరు కుళ్లువ్యాధి వస్తుందని మండల వ్యవసాయ అధికారి స్వాతి రైతులకు సూచించారు. నారాయణపురం, చిన్నదేవులపురం గ్రామాల్లో బుధవారం నిర్వహించిన 'పొలం పిలుస్తుంది'కి జల వనరుల కేంద్రం నుండి యువ చంద్రశేఖర్ రెడ్డి, హార్టికల్చర్ శాఖ నుండి పతంజలి ప్రైవేట్ లిమిటెడ్ ఫీల్డ్ ఆఫీసర్ మౌనిక హాజరై మాట్లాడారు. కాంప్లెక్స్ ఎరువులు దుక్కుల్లోనే వేసుకోవాలని, ఎలుకల నివారణ కోసం రైతు సేవా కేంద్రంలో మందులు అందుబాటులో ఉన్నాయని, ఎలుకల నివారణ కోసం నూరు గ్రాముల బియ్యం నూక మందుతో కలిపి రైతు పొలం గట్లపైన పెట్టుకోవాలని సూచించారు. ఆయిల్ ఫామ్‌లో సాగు చేయాలనుకున్న రైతులకు సబ్సిడీపై ప్రభుత్వం రుణాలు అందిస్తుందని తెలిపారు. వ్యవసాయ శాఖ సూచనల మేరకు లాభసాటి వ్యవసాయం చేయాలని సూచించారు. కార్యక్రమంలో రైతు సేవా కేంద్రం సిబ్బంది రైతులు పాల్గొన్నారు.

బేతంచెర్ల : మామిడి, చీని, అరటి, మిరప, టమోటా, ఉల్లి పంటల సాగుపై తగు జాగ్రత్తలు తీసుకోవాలని ఉద్యానవన అధికారి రఘువరన్, మండల వ్యవసాయ అధికారి కిరణ్ కుమార్ అన్నారు. మండలంలోని సీతారామపురం, ఎంబాయ్ గ్రామాల్లో మండల వ్యవసాయ అధికారి కిరణ్ కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన 'పొలం పిలుస్తుంది'లో వారు పాల్గొని మాట్లాడారు. కంది, పత్తి, మొక్కజొన్న, సజ్జ మొదలగు పంటలు సాగు చేసుకునే ముందు రైతులు పంట దిగుబడి కోసం సంబంధిత రైతు భరోసా కేంద్రాల్లో అధికారులను సంప్రదించి తగు మోతాదులో ఎరువులు, మందులు వాడాలని తెలిపారు. కార్యక్రమంలో అగ్రికల్చర్ అసిస్టెంట్ సుదర్శన్ రెడ్డి, సెరికల్చర్ అసిస్టెంట్ రాజ్యలక్ష్మి, ఏఈఓలు మధు, బెన్ని రాజు, సర్పంచి యుగంధర్ రెడ్డి, రైతులు పాల్గొన్నారు.

చాగలమర్రి : ఎలుకల నివారణ మందు తయారీనీ పరిశీలిస్తున్న దృశ్యం

ఆళ్లగడ్డ : ఎలుకల నిర్మూలనపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

రుద్రవరంలో..

బండి ఆత్మకూరులో..

బేతంచెర్లలో..

14 నుండి 20 వరకు పల్లె పండగ

- రోజుకు 10 వేల లోపు ఉపాధి కూలీలకు పనులు

- డ్వామా పీడీ జనార్దన్ రావు

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

రాష్ట్ర ప్రభుత్వం ఈ నెల 14 నుండి 20 వ తేదీ వరకు ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న పల్లె పండగను విజయవంతం చేసేందుకు అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నామని డ్వామా పీడీ జనార్దన్ రావు తెలిపారు. బుధవారం ఆయన ప్రజాశక్తితో మాట్లాడుతూ పల్లె పండగ పేరుతో పంచాయితీ వారోత్సవాలను జిల్లాలోని అన్ని గ్రామాల్లో నిర్వహిస్తున్నామని చెప్పారు. ప్రధానంగా సీసీ రోడ్లకు, పలు అభివవృద్ధి పనులకు భూమి పూజ కార్యక్రమం చేపట్టనున్నట్లు తెలిపారు. ఈ పనులకు ఉపాధి నిధులు కేటాయిస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమాల్లో జిల్లాలోని రాష్ట్ర మంత్రులతో పాటు ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు పాల్గొంటారని తెలిపారు. జిల్లాలో ఉపాధి హామీ పనులు మందకొడిగా సాగుతున్నాయని పేర్కొన్నారు. పంట పొలాల్లో పనులు ఉండటం వల్ల ఉపాధి పనులు కల్పించినా కూలీలు పనులకు రావడం లేదన్నారు. బుధవారం కేవలం 8,200 మందికి ఉపాధి పనులు చూపినట్లు వెల్లడించారు. అలాగే జిల్లాలో పశువుల షెడ్లకు సంబంధించి ఎంపిడిఒల ద్వారా వచ్చిన దరఖాస్తులను పరిశీలించి జిల్లా కలెక్టర్ ద్వారా పరిపాలన అనుమతులు తీసుకుంటున్నట్లు తెలిపారు.

దూరవిద్యలో 'ఉర్దూ' ఉన్నత చదువులకు అవకాశం

- నంద్యాల ముస్లిం జెఎసి ఆధ్వర్యంలో గోడపత్రిక విడుదల

ప్రజాశక్తి - నంద్యాల

నేషనల్ యూనివర్సిటీ దూరవిద్య ద్వారా ఉర్దూ మీడియంలో ఇంటర్ తరువాత నంద్యాల నుండే ఉన్నత చదువులకు అవకాశం కల్పిస్తున్నారని, సద్వినియోగం చేసుకోవాలని నంద్యాల ముస్లిం జెఎసి గౌరవాధ్యక్షులు అబ్దుల్ సమద్, మహమ్మద్ అబులైస్, మౌలానా ఆజాద్ కోరారు. బుధవారం స్థానిక క్రాంతి రేఖ గ్రంథాలయంలో జరిగిన ప్రెస్‌మీట్‌లో వారు మాట్లాడారు. నంద్యాలలో జోహార్ ఎడ్యుకేషనల్ ఇన్స్టిట్యూషన్స్, ఆటోనగర్ నందు మౌలానా ఆజాద్ నేషనల్ ఉర్దూ యూనివర్సిటీ వారి డిస్టెన్స్ ఎడ్యుకేషన్ స్టడీ సెంటర్‌లో, ఉర్దూ మీడియంలో బిఏ, బీకాం, బీఎస్సీ, (మాథ్స్, బి జెడ్ సి లైఫ్ సైన్సెస్) కోర్సులు ఇంటి దగ్గరే ఉండి దూర విద్య ద్వారా యువతీ యువకులు అభ్యసించవచ్చని తెలిపారు. వివరాలకు 9440078697కు సంప్రదించాలని కోరారు. అనంతరం గోడ పత్రికలను విడుదల చేశారు. కార్యక్రమంలో జోహార్ విద్యా సంస్థల కరస్పాండెంట్ డా.పి.జోహార్ హుస్సేన్, కోకన్వీనర్లు సద్దాం హుస్సేన్, మస్తాన్ ఖాన్, ట్రెజరర్ ఎస్పీ భాష, ఉర్దూ సెక్రెటరీ డా.సయ్యద్ అంజద్ భాషా ఖాద్రి, మీడియా సెక్రెటరీ జానొ జాగో మహబూబ్ బాషా తదితరులు పాల్గొన్నారు.

పోస్టర్లు విడుదల చేస్తున్న దృశ్యం

ఎమ్మెల్యే దంపతులను కలిసిన రాష్ట్ర సీడ్స్ కార్పొరేషన్ చైర్మన్

ఎమ్మెల్యేను కలిసిన రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్

ప్రజాశక్తి - ఆళ్లగడ్డ

ఆళ్లగడ్డ ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ, భార్గవరామ్ దంపతులను, టిడిపి యువ నాయకుడు భూమా జగద్విఖ్యాత్ రెడ్డిని బుధవారం రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ నూతన అధ్యక్షులుగా నియమితులైన ధర్మవరం మన్నే సుబ్బారెడ్డి ఎమ్మెల్యే నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ధర్మవరం మన్నే సుబ్బారెడ్డి వారికి శాలువా కప్పి పుష్పగుచ్చం అందజేశారు. ఈ సందర్భంగా వారు సీడ్స్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్‌గా నియమితులైన ధర్మవరం మన్నే సుబ్బారెడ్డికి అభినందనలు తెలియజేశారు. టిడిపిని నమ్ముకున్న వారికి సిఎం చంద్రబాబు నాయుడు తప్పక న్యాయం చేస్తారని తెలిపారు.

'కస్తూరిబా'లో బోధనేతర పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానం

ప్రజాశక్తి -రుద్రవరం

మండల కేంద్రంలోని కస్తూరిబా గురుకుల బాలికల పాఠశాలలో ఒక సంవత్సర కాలానికి బోధనేతర సిబ్బంది పోస్టుల భర్తీకి అర్హులైన, ఆసక్తి కలిగిన మహిళా అభ్యర్థుల నుండి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు మండల విద్యాధికారి కోటయ్య తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ దరఖాస్తులను ఈ నెల 15వ తేదీ లోపు ఎంఇఒ కార్యాలయంలో అందజేయాలన్నారు. కస్తూరిబా పాఠశాలలో అసిస్టెంట్ కుక్-2 (ఓపెన్ కేటగిరీ-1, ఎస్‌సి-1), స్కావెంజర్-1 (ఓపెన్), స్వీపర్ -1(ఓపెన్), హెడ్ కుక్-1(ఓపెన్), చౌకీదారు-1(ఓపెన్) మొత్తం 6 నాన్ టీచింగ్ సిబ్బంది పోస్టులకు దరఖాస్తు చేసుకోవచ్చున్నారు. ఓసి మహిళలు 42 సంవత్సరాలు, ఎస్సీ ఎస్టీ బీసీ 47, వికలాంగులు 52 సంవత్సరాల వయసు కలిగి ఉన్నవారు అర్హులన్నారు. అనుభవం ఉన్న మహిళలకు 45 సంవత్సరాల వయసు ఉండాలన్నారు. **కొలిమిగుండ్ల :** కొలిమిగుండ్ల మండలంలో ఆరు పోస్టు ఖాళీలు ఉన్నాయని ఎంఈఓ అబ్దుల్ కలాం తెలిపారు. ఆయన మాట్లాడుతూ కస్తూరిబా బాలికల విద్యాలయంలో వంట సహాయకురాలి పోస్టులు 3, 1 స్వీపర్, 1 చౌకీదారు, నైట్ వాచ్మెన్ ఒకటి ఖాళీలు ఉన్నాయని, అర్హులైన వారు ఈ నెల 15వ తేదీలోపు దరఖాస్తులు చేసుకోవాలని తెలిపారు.

కాళరాత్రి అలంకారంలో చౌడేశ్వరి దేవి

ప్రజాశక్తి - బనగానపల్లె

మండలంలోని నందవరం చౌడేశ్వరి దేవి దేవస్థానంలో దసరా నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఏడవ రోజు బుధవారం అమ్మవారు బ్రహ్మచారిణి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు . అమ్మవారికి అభిషేక, నిత్యార్చన విశేష పూజా క్రతువులు నిర్వహించి యాగశాల నందు ఆలయ వేద పండితుల, అర్చకులు ఆధ్వర్యంలో ఆవాహిత దేవతా పూజలు చండీ పారాయణం, విశేష పూజలు నిర్వహించారు. ఆలయ అసిస్టంట్ కమిషనర్, కార్యనిర్వాహణాధికారిణి జి. కామేశ్వరమ్మ, మాజీ చైర్మన్ కుమార్ రెడ్డి దేవస్థానానికి వచ్చిన భక్తులకు ప్రత్యేక వసతులను కల్పించారు.


కాళరాత్రి అలంకారంలో చౌడేశ్వరి దేవి

పాదరక్షలు పంపిణీ చేస్తున్న మండల వైద్యాధికారి

పాదరక్షలు పంపిణీ

ప్రజాశక్తి - చాగలమరి

చాగలమర్రి పట్టణంలోని ప్రభుత్వ వైద్యశాలలో నలుగురు కుష్టి వ్యాధిగ్రస్తులకు ఉచితంగా పాదరక్షలను మండల వైద్యాధికారి అంజలి బుధవారం పంపిణీ చేశారు. ఆమె మాట్లాడుతూ వ్యాధిగ్రస్తులకు ఎంసిఆర్ పాదరక్షలను ఉచితంగా అందజేశామన్నారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్వైజర్ రామలింగారెడ్డి, ఏఎన్ఎం భూదేవి తదితరులు పాల్గొన్నారు.

ఆంధ్ర చెస్ అసోసియేషన్ వైస్ చైర్మన్‌గా డాక్టర్ రవికృష్ణ

- నిర్వాహక కార్యదర్శిగా రామ సుబ్బారెడ్డి

ప్రజాశక్తి - నంద్యాల : ఇటీవల విజయవాడలో జరిగిన ఆంధ్ర చెస్ అసోసియేషన్ సర్వసభ్య సమావేశంలో నూతన రాష్ట్ర కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. జిల్లా నుండి రాష్ట్ర వైస్ చైర్మన్‌గా డాక్టర్ రవికృష్ణ, నిర్వాహక కార్యదర్శిగా రామ సుబ్బారెడ్డిలను ఎన్నుకున్నారు. డాక్టర్ రవికృష్ణ, రామ సుబ్బారెడ్డిలను రామకృష్ణ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ రామకృష్ణారెడ్డి, శ్రీ గురు రాఘవేంద్ర విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ దస్తగిరి రెడ్డి, కళారాధన సాంస్కృతిక సంస్థ అధ్యక్షులు డాక్టర్ మధుసూదన రావు, ఐఎంఏ నంద్యాల అధ్యక్ష కార్యదర్శులు డాక్టర్ వసుధ రాణి, డాక్టర్ పనీల్, రాష్ట్ర ఐఎంఏ సంయుక్త కార్యదర్శి డాక్టర్ విజయభాస్కర్ రెడ్డి, ఎన్ఆర్‌జి చెస్ అకాడమీ గౌరవ అధ్యక్షులు రాజేష్ అభినందనలు తెలిపారు.

నంద్యాల డివిజన్‌లో 522 దరఖాస్తులు

- 16న లాటరీ పద్ధతిలో షాప్‌లు కేటాయింపు : సిఐ

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్ : నంద్యాల డివిజన్ పరిధిలో మద్యం దుకాణాలకు ఇప్పటి వరకు 522 దరఖాస్తులు వచ్చినట్లు నంద్యాల ప్రొహిబిషన్, ఎక్సైజ్ శాఖ సిఐ కృష్ణమూర్తి తెలిపారు. బుధవారం ఆయన మీడియాతో మాట్లాడారు. నంద్యాల మున్సిపాలిటీలో 10 షాప్‌లకు 44 దరఖాస్తులు, నంద్యాల రూరల్ 4 షాప్‌లకు 10, బండి ఆత్మకూరు 3 షాప్‌లకు 3, గడివేముల 2 షాప్‌లకు 3, మహానంది 3 షాప్‌లకు 2 దరఖాస్తులు వచ్చాయన్నారు. ప్రారంభం నుండి నేటి వరకు నంద్యాల మున్సిపాలిటీ 317, నంద్యాల రూరల్ 41, బండి ఆత్మకూర్ 35, మహానంది 29, పాణ్యం 48, గడివేముల 53 మొత్తం 522 దరఖాస్తులు వచ్చినట్లు వెల్లడించారు. ఆన్‌లైన్ దరఖాస్తుకు ఈ నెల 11వ తేదీ వరకు గడువు పొడగిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని తెలిపారు.

మురుగు నీటితో మద్దమ్మ చెరువు కలుషితం

పట్టించుకోని పంచాయతీ అధికారులు

ప్రజాశక్తి-మద్దికేర

మద్దికెర మండలం మద్దికేర గ్రామంలో ఉన్న మద్దమ్మ చెరువులోకి కలుషిత నీరు చేరుతున్న పంచాయతీ అధికారులు, పట్టించుకోకపోవడం పట్ల గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మద్దికేర గ్రామం పక్కనే మద్దమ్మ చెరువు ఉంది. ఈ చెరువు నీటి ప్రవాహం ఆధారంగానే గ్రామంలో ఉన్న బోర్లలో నీటి సామర్థం ఉంటుంది. ఇంత ఆవశ్యకత ఉన్న చెరువులోకి గ్రామ సమీపంలోనే కస్తూరిబాయ్, తహశీల్దార్ ఆఫీస్ సంబంధించిన, మురుగనీరు మొత్తం చెరువులోకి మలిస్తున్నారు. ఈ కలుషిత నీరు చేరడం వల్ల చెరువులో ఉన్న మంచినీరు దుర్భష భరితంగా మారుతుంది. ఇంటి అవసరాలకు కూడా కొంతమంది నీటిని తీసుకెళ్తుంటారు. చెరువు నీరు కలుషితం కావడం వల్ల బోర్లలో ఉన్న మంచినీరు వాసన వచ్చే పరిస్థితులు ఉన్నాయి. గ్రామంలోనే పశువులు కూడా ఈ నీటిని తాగాల్సిన దుస్థితి నెలకొంది. చెరువులోకి వస్తున్న మురుగునీరును, అరికట్టాల్సిన, పంచాయతీ అధికారులు, నిర్లక్ష్యం పట్ల ప్రజలు మండిపడుతున్నారు.

మద్దమ్మ చెరువులోకి పారుతున్న మురుగునీరు

త్వరలో టిడిపి సభ్యత్వ నమోదు ప్రారంభం

అవగాహన సదస్సులో పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత రెడ్డి

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్ : పాణ్యం నియోజకవర్గంలో త్వరలో టిడిపి సభ్యత్వ నమోదు ప్రారంభం అవుతుందని ఎమ్మెల్యే గౌరు చరిత రెడ్డి తెలిపారు. గౌరు దంపతుల స్వగహం మాధవి నగర్‌లో నూతన టిడిపి సభ్యత్వ కార్యక్రమం ప్రారంభంలో భాగంగా పాణ్యం నియోజకవర్గం పరిధి బూత్ యూనిట్, క్లస్టర్ ఇన్చార్జులకు అవగాహన సదస్సు బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గౌరు చరిత రెడ్డి మాట్లాడుతూ టిడిపిలో సభ్యత్వం ఉంటే అది మా కుటుంబ సభ్యునితో సమానం అని అన్నారు. వంద రూపాయలతో సభ్యత్వం తీసుకుంటే రూ.5 లక్షల బీమా సౌకర్యం ఉంటుంది అన్నారు. మీ కుటుంబానికి కష్టం వస్తే ఎన్టీఆర్ ట్రస్ట్ ద్వారా పిల్లల చదువులకు సాయం ఉంటుందని తెలిపారు. లక్ష మందికి తగ్గకుండా సభ్యత్వ నమోదు చేద్దామని, పార్టీలో కష్టపడ్డ ప్రతి ఒక్కరికీ గుర్తింపు ఉంటుంది అన్నారు. సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ బాధ్యతగా తీసుకోవాలని ఎమ్మెల్యే గౌరు చరిత రెడ్డి పిలుపునిచ్చారు. ముఖ్య అతిథులుగా టిడిపి సీనియర్ నాయకులు నందికొట్కూరు నియోజకవర్గం ఇన్చార్జి గౌరు వెంకటరెడ్డి, మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ పెరుగు పురుషోత్తం రెడ్డి, బ్రహ్మణ పల్లె నాగిరెడ్డి, శైలజ యాదవ్, ఓర్వకల్లు మండల కన్వీనర్ గోవింద్ రెడ్డి, ఓర్వకల్లు మండల కన్వీనర్ డి.రామాంజనేయులు, కల్లూరు అర్బన్ 16 వార్డ్ ల ఇన్చార్జిలు,బూత్, క్లస్టర్,యూనిట్, ఇన్చార్జి లు ముఖ్యమైన నాయకులు పాల్గొన్నారు.

అవగాహన సదస్సులో మాట్లాడుతున్న పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత రెడ్డి

పులకుర్తిలో పొలం పిలుస్తుంది

ప్రజాశక్తి - కోడుమూరు రూరల్

కోడుమూరు మండలంలోని పులకుర్తి గ్రామంలో బుధవారం పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు. వ్యవసాయ అధికారులు పంట పొలాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి, తగు సూచనలు చేశారు. రైతులకు సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకుంటు అధిక దిగుబడుల సాధనకు ఈ కార్యక్రమం ఉపయోగపడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి రవి ప్రకాష్ తో పాటు వ్యవసాయ సిబ్బంది కొండయ్య, అంజలి, వీఆర్వో పరమేష్, వెటర్నరీ చంద్రమౌళి ,సర్పంచ్ సూర్యనారాయణ , రైతులు కొళాయి నాగేష్ ,కొళాయి లింగన్న ,నాగేశ్వర్ రెడ్డి ,సుధాకర్ రెడ్డి, రాముడు పాల్గొన్నారు.

ఇఒపై చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి-కర్నూలు క్రైం

కర్నూలు బళ్లారిచౌరస్తా శ్రీవీరాంజనేయ స్వామి దేశాలయం దేవాలయ ఇఒపై చర్యలుత తీసుకోవాలి పాణ్యం తెలుగు యువత అధ్యక్షుడు జె.గంగాధర్‌గౌడ్ డిమాండ్ చేశారు. బుధవారం ఆయన నాయకత్వంలో నిరసన తెలిపారు. ఐదేళ్లనుంచి గుడికి ఎలాంటి రంగులు వేయలేదని, పారిశుధ్య పనులు చేయడం లేదని, మంచినీటి సౌకర్యం కూడా లేదన్నారు. వాహనపూజకు ఒకే టికెట్‌పై మూడు, నాలుగు వాహనాలకు పూజలు చేసి డబ్బులు కాజేస్తున్నారు. ఆలయాన్ని పరిశుభ్రంగా ఉంచాలని డిమాండ్ చేశారు. ప్రతి సంవత్సరం ఆలయానికి రూ.కోటి దాకా ఆదాయం వస్తుందని, ఆలయ అభివృద్ధికి ఎలాంటి ఖర్చు చేయడం లేదని విమర్శించారు.

రైతులు సూచనలు పాటించాలి

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

పత్తి పంటలో అధిక దిగుబడులు సాధించేందుకుగాను రైతులు వ్యవసాయ శాఖ సలహాలు సూచనలు పాటించాలని ఏరువాక కేంద్రం శాస్త్రవేత్త రవి కిషోర్ జిల్లా వనరుల కేంద్రం సంస్థ అధికారి నాగ సరోజమ్మలు పేర్కొన్నారు. బుధవారం ఓర్వకల్ మండలంలోని నన్నూరు గ్రామంలో రైతులతో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మండల వ్యవసాయ శాఖ అధికారి సుధాకర్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో వారు పాల్గొని మాట్లాడారు. పత్తి, కంది ,పొగాకు , ఆముదంలో వచ్చు చీడపీడలు , తెగుళ్ల గుర్తించాలన్నారు. పత్తినాణ్యత మీద నాణ్యత పై రైతులకు రైతులకు వివరించారు. ఎయు భాస్కర్, రైతు సేవ కేంద్ర సిబ్బంది , గ్రామ రైతులు పాల్గొన్నారు.

13 నుంచి జోహరాపురం ఉరుసు

ప్రజాశక్తి - కర్నూలు జిల్లాపరిషత్: కర్నూలు నగరం లోని జోహారాపురంలో ఈ నెల 13 ఆదివారం గంధము,14 సోమవారం ఉరుసు (తట్టీలు), 15 మంగళవారం కిస్తీలు (జియారత్)ఉరుసు మహెూత్సవం జరుగుతుందని దర్గా నిర్వాహకులు ముత్తవలి సయ్యద్ అల్లాఉద్దీన్ షరీఫ్ పాషా బుధవారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ జోహారాపురము గ్రామం లో హిందువులు, ముస్లింలు, క్రైస్తవులు కలిసి 3 రోజులు ఆనందంగా జరుపు కుంటారని, ఈ ఉరుసుకు జిల్లా నలుమూలలనుండి హాజరు అవుతారని చెప్పారు. గత 370 సంవత్సరాల నుండి ఈ ఉరుసు మహోత్సవం జరుగుతుందని, భక్తులందరు ఉరుసుకు హాజరై జయప్రదం చేయాలని ఆయన కోరారు.

సరస్వతీ దేవిగా వాసవి మాత

ప్రజాశక్తి - మంత్రాలయం : దేవీ శరన్నవరాత్రుల ఉత్సవాల్లో భాగంగా వాసవి మాత సరస్వతి దేవిగా బుధవారం భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారికి పురోహితులు గతమాచార్ ఆధ్వర్యంలో ఎంపీటీసీ సభ్యుడు వెంకటేష్ శెట్టి దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

భక్తుడి మృతదేహం లభ్యం

ప్రజాశక్తి - మంత్రాలయం

ప్రముఖ ఆధ్యాత్మిక పుణ్యక్షేత్రమెన మంత్రాలయం సమీపంలో ప్రవహిస్తున్న తుంగభద్ర నదిలో స్నానానికి వెళ్లి గల్లంతైన భక్తుడు సుబ్బారాయప్ప మృతదేహం బుధవారం లభించింది. మంగళవారం రాఘవేంద్రస్వామి దర్శనార్థమై కర్నాటక రాష్ట్రం చిక్ బళ్ళాపూరు జిల్లా ద్వారగనహల్లి గ్రామానికి చెందిన సుబ్బారాయప్ప కుటుంబ సభ్యులతో కలిసి మంత్రాలయం వచ్చారు. తుంగభద్ర నదిలో స్నానానికి వెళ్లి కాలుజారి లోపలికి వెళ్లిపోయిన ఆయన బుధవారం నందవరం మండల పరిధిలోని నదీ కైరవాడి గ్రామ సమీపంలో మృతదేహం బయట పడింది. పోలీసులు మతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. మృతుడు సుబ్బారాయప్ప భార్య కూడా 10 సంవత్సరాల క్రితం అనారోగ్యంతో మృతి చెందింది. వారికి కుమార్తె ఉన్నారు